త్రిపురనేని కవిరాజునకు
నూలుపోగు

పుట	పొరపాటు	దిద్దుబాటు
6	మట్టిమాటలన్	మిట్టిమాటలన్
12	సెట్లు వీలుపడు	నేడు వీలుపడు
,,	దృగంతరోషమే	దృగంతరార్ద్రమే
26	సంపూర్ణగరిమ	ప్రభూతకీల
29	మూర్ఢము	మూర్ధము
35	విశ్వసించి	నిశ్వసించి
36	ఆంధ్రసామ్రాట్లు	ఆంధ్రసమ్రాట్టు
39	నీపురుషాయుషమ్ము	నాపురుషాయుషమ్ము
50	బల్కి—రిగదా	బల్కి—తిరిగా
51	తనకు	దనకు
51	తదన్యులకు	త్వదన్యులకు

మహోదయము

ఎవనిధర్మ పరాంకోటి కెక్కినంత
గుణము నాల్గుదిక్కుల నొక్క కొలికి జేర్చె
న మ్మహాబాహునకు, త్రిలింగాధినేత,
క ప్రతిమ పరాక్రమ శాలి కవుత జయము.

చెడుగుడు లాడి వైరి నృపసింహుల మోముల దన్నివచ్చి నీ
యడిదము రాశివోసినది రా ! తెలుగుం బాలమందు ధైర్యముల్;
పిడికెడు లేని యీ తెలుగు పిల్లలు నిగ్గనులార జూడగా
నుడుగర దెచ్చి నార; లివిగో నవచారణ మంజుగీతికల్ !

జాణలు, సాంధ్యరాగ పరిచారిణు లుత్కల రాజకన్య పా
రాణులు, కుంకుమమ్ములు పరామరిసించి లిఖించవీ తెలం
గాణము బుస్సునం దిగుచు కాలకరాళకృపాణధార వి
శ్రాణములైన కాంతులు దిశాతతి నిండిన విహ్వాలించుచున్.

యుగసంధ్య

నీ తురంగ రింఖలను ఖణేలున ముఖ
రించు శత్రుభూముల విజృంభించి శాంతి
దేవత తదేకనిష్ఠ నర్తించి దశది
శీ విజయ ఘంటికారవ శ్రీల నించు.

నెత్తిన మొత్తి శాత్రవుల నీ రణ దుర్భర శౌండిమమ్ము లు
ర్వ్యుత్తుగ గుంజి తెచ్చి మణు లిచ్చిన నచ్చనగాయ లాడు నీ
మత్తగజేంద్రగామినులు మంగళ గానముతో నివాళి నీ
కెత్తుచునున్నవారిదె గ్రహింపుము చల్లని నిండు చూపులన్.

అనుపమముల్ త్వదీయ విజయమ్ములు విశ్వములోన నారగా
సిన పరువంపు వెన్నెలల శీతల సైకత వేదులందు సం
తనపడి యాటలాడు బుడుతల్, ముదితాత్ములు, రాజ! నీదు ద
ర్శనమున కారటంపడుచు సాచుచు నుండిరి మేలిచూపులన్.

ఆనులు పాను లేదిన పరాంబుధి నీ ఘనపౌరుషమ్ము మం
థానగిరీంద్రమై కలచినన్ ప్రభవించిన యప్సరోంగనల్
సూన నిగుంభితాక్షతల చొక్కపు నర్తన భంగిమమ్ములన్
పూని, నిరీక్షతో నిలిచిపోయిరి, నీ కొలు విమ్మ వారికిన్.

జెట్టీలగు పగతురు నీ
బెట్టిద మగు లక్ష్యశుద్ధి బెంబేల్వడి య
ట్టిట్టగుచుం బోరాడక
యుట్టీ గొట్టియు నొసంగుచుందురు కరముల్.

కాంతా జనములు, జిత సా
మంతులు, సేనాధిపతులు, మంత్రులు, ప్రతిభా
వంతులు నీకై చూపుల
దొంతరలం గట్టినారు తోరణ పంక్తుల్.

అంగము నంగమందు సకలాధిప దుస్సహ శౌర్య రేఖలు
ప్పొంగు తెలుంగు జోదుల యపూర్వపు తేజము లేర్చి నీ సభా
రంగము నెల్ల కుంకుమపు రాగముతోడ నలంకరించె; పా
రంగత జైత్రయాత్ర! యిక రాగదె నిండిన కొల్వు దీర్పగన్.

వాడి యలుంగులౌచు పగవారిమగంటిమి పాదు చీల్చి చెం
డాడిన నీ మహత్తర దృగంచల మాలిక సుప్రసన్నమై
యాడిన చోటులం దొలగి యట్టిటు పాయలుపాయలై గుమిన్
గూడి సభాముఖమ్మున జనుల్ పచరింతురు కౌతుకమ్ములన్.

అధిజ్యధన్వము

మేపిన ద్రవ్యమెల్ల దిగమ్రింగిన నీ యుదరమ్ములోపలన్
కాపురమున్న భూపతి ఋణమ్ములు గబ్బున త్రేచునే గదా!
పాప మతండు నిండిన దివాణములో కవిచంద్రులన్ గృతి
వ్యాపృతి కెచ్చరింప దగడా? అధికారము చూప నోచడా?

స్వార్థ మొకండె కోరి నరపాలుడు కొల్వున బిల్చి మీ కవి
త్వార్థము లారతిమ్మనెనె? ఆంధ్ర జనమ్ముల చిత్తవృత్తులన్
దుర్ధర భారముల్ తొలగద్రోయ దలంపడె? ఆంధ్రసాహితీ
వర్ధన మెంచడే? ప్రజల భద్రము లించుక సంస్మరింపడే?

ఆతని బాహుశౌర్య విజయమ్ములలో మన తెల్గు సంపదల్
మ్రోతలు మ్రోయవే? వలసపోయి యశస్సు కుదుళ్ళుకట్టదే?
ఆ తరుణాంధ్రసింహుల భయానక గర్జలు మారుమ్రోగవే?
నూతన శారదాచరణ నూపుర నాదము బోరుకొల్పదే?

అధిజ్యధన్వము

ఈ జగతీ హితమ్ము, జగతీశుని చిత్తము నేటి కొక్కటై
రాజికి వచ్చి ముందు ధనరాసులు గల్లున గ్రుమ్మరించి మీ
పూజలు మ్రొక్కుబళ్ళ ముడుపుల్ తుదికాసున నప్పగించుచున్
మా జయగర్భ కావ్యకుసుమమ్ముల గూర్పు డటన్న కష్టమే?

ఎరుగునె యీ త్రిలింగ వసుధేశుడు మీ కవితామహత్వముల్?
దొరలెను నేటి కీ యనవలోకిత పద్ధతి భాగ్యచక్రముల్;
మరల లభింపనేరవు సుమా! అవకాశము వీడబోకుడీ!
గరగర పోవనిండు తమ గంటము పోయిన యంతమట్టుకున్.

ఆ యువ పట్టిదేబె, కవితార్థ విధానమెఱింగి యున్నచో
పాయునె రాజాసంగు ధనభాగ మటంచు జగమ్ము కోడియై
కూయును, కూసితీరుగద; కోరి స్వయమ్ముగ దుర్యశమ్మునన్
బోయెడు, వాని కీర్తిపయి బోసెదవీవె మషీరసమ్ములన్.

ఉల్లమునందు నక్కటిక మూని, మహీపతి పొట్టకూటికై
వెళ్ళగబోయు నిన్ను పిలిపించి, కవీంద్రపదమ్ము గట్టి కో
కొల్లలుగా ధన మ్మొసగి కొల్చుచునుండ గణింపవేమయా?
జల్లెడపట్టెనే యెడద జారెను గౌరవభావపూరముల్.

అనుచు యువజాని కవిని నేత్రాంచలముల
జూచుచు కరాబ్జమల్లన సాచి గృహిణి
చంద్రరేఖ; తత్కేశపాశమ్ము దిద్దె,
మసక వెన్నె లొలికె ముఖమండలమ్ము.

ఎవ్వతె నూరిపోసినది? యే యపవాదము పుట్టలేదుగా?
అవ్విభునానతిన్ గడవనాడితినా? సభలో నరేంద్రుపై
చివ్వకు కాలుద్రివ్వితిన? చెప్పుము, సంగతు లేమి పుట్టెనో?
గవ్వలగుత్తులీ ప్రజలు, కాదన రా, దన జంద్రరేఖయున్.

"ఇంతటి బుద్ధిమంతుడు మరెక్కడ కన్పడబోవ, డెన్నడుం
బంతము లాడబోడు, తనమార్గమె మార్గముగాని, యన్య మా
వంత దలంపబోడు; వహావా మగడయ్యెను నాకు; పూర్వ జ
న్మాంతర పుణ్యరేఖ లిటు లయ్యెను పల్కకు మట్టిమాటలన్.

గారవ మించి ఆ ధరణికాంతుడె ఆదరపూర్వకమ్ముగా
ఆరని యాంధ్ర తేజముల అగ్నికణమ్ముల రేచు కావ్యముల్
కోరుట యేమి? ఆ కవులు లోగి హసా దనుటేమి? అప్పుడే
మీరలు దక్షిణల్ గొనక మిన్నులు చూచుట యేమి చెప్పుడీ?

అధిజ్యధన్వము

ఆతడు సైచె, వేరొక ధరాధిపు డైన నుదగ్రమూర్తియై
నీ తల కొట్టకుండునె ఢణేలున? కోటకు గట్టకుండునే?
ఆతని సొమ్ములన్ మెసవినట్టి ఋణమ్ములు కంచుఢక్కలై
మ్రోతలు మ్రోయవే యెడదమూలల, మూలల, మాటిమాటికిన్?

చేసిన తప్పు నొప్పుకొని, చివ్వన రాజును జూచి కావ్యమున్
వ్రాసెదనంచు దక్షిణలు పట్టుము; మేలగు, కానివేళ నీ
దోసిట నీవె నిప్పుకలు దోర్చి శిరమ్మున జల్లుకోవలెన్;
బాసలకోసమై పెనగవద్దుర! సూత్రమొకింత నిల్పరా!"

అనిన నా యువకవి మందహాస మొలుక,
ఏది యెట్లుపోయినను నీ కేమిగాని
తప్పదింత, దక్షిణలు నీ తాలిబొట్టు
మరచిపోబోన నేమాత్ర మరువ," ననియె.

"స్థాణువవోయి మృత్యువు విషమ్ములు గ్రక్కెడు వేళ గూడ నీ
బాణపు పోటుల న్విడవు; పాపపు పంటగ అత్తగారు పా
షాణము గాంచి నాకొరకు జార్చెను గుండెలు గ్రుమ్మిపోయగా;
జాణతనమ్ము చాలు, నిక జాలును, మానుమ యుల్లకుట్టులన్."

అనుచు చెమ్మగిల్లిన నయనాంచలములు
పైటతో నద్దుకొనెడి వధూటి జూచి
కరగి జావయై యామెను కౌగిలించి
కవివతంసుడు నిముసమ్ము కన్ను మోడ్చె.

"ఈవె రణాంగణాన విహరించిన నిట్టులు తీర్పులిత్తువే?
యీ వసుధాధినేత జరిపించిన కోతకు మారుతమ్ములే
ఆవురుమంచు నేడ్చెను; లతాంతములెల్ల వసుంధరా పరా
గావళి రాలి దొర్లెను; దయాలవమేని జనింపలేదుగా!

"కోతల నాపు మాపు," మని గుండెలు గుండెలు బాదుకొన్న ది
జ్మాతలు గుండియల్ పగిలి ప్రమ్రగ్గిరి కాని అపార మేదినీ
నేతకు నశ్రుకంకణము నేత్రమునం గనుపింపలేదు; తా
పాతిన కత్తిగా నిలిచి వక్కలుగా తరిగించె నా ప్రజన్.

అంతటి పుణ్యవంతుడు గదా నరపాలుడు! తచ్చరిత్రలో
గంతులు పెట్టగావలెనె కావ్యవిలాసిని? ఆ దురంతకా
లాంతక మూర్తికే కృతి సమర్పణమా? ఇక ముందువారి కాం
క్షింతలు నేలమీద పడునే? యొకసారి తలంచిచూడుమా!

ఉన్నను లేకయున్న, నెటులో పడిపంచలలోన పండి భి
క్షాన్నము లేనియుం గుడిచి అందరిలో ముఖమెత్తి చూతు; మా
తెన్నన బోక భూపతి విధించినరీతి చరింతుమేని ఇం
కెన్నడిదేటు? బందుగుల యిండ్లకు బోయిన నీళ్ళు పుట్టునే?

ఆ పసికుంక కా లెదిగి ఆటలకోసము రేగి వీధిలో
పాపల జేరి యేమగునో భావన సేయుము; రాలు దూకునో,
లోపలి ప్రేవులం గొరుకు లుచ్ఛపు కారులు ప్రేలిపోవునో,
తాపుల వీపుపై కనకతప్పెట మ్రోగునో; నిర్ణయింపుమా!"

ఇట్లు హెచ్చరించిన జీవితేశు జూచి
రిత్తవోయి మ్రాన్పడి చంద్రరేఖ పలుక
దయ్యె; దుస్సహ లిప్సా సహస్ర మరిగ
గొంతు సవరించుకొనుచు నా యింతి పలికె:—

"ఐనను భూతలేశ్వరుని ఆదరభావము కాల దన్ని, ఆ
స్థానిపదమ్ము దుల్పుకొని, సాజ దరిద్రత కట్టుకొన్న సో
పాన పరంపరల్ గడచి, వాయువు దూరని చీకటింట దుః
ఖానక జీవికాయుగము ఖైదొనరింపగ నిశ్చయింతురే?

యు గ సం ధ్య

తేలిన యింద్రభోగముల దీనయిపోయిన నెత్తి మొత్తె కా
బోలు! వివిక్తదేశమున, పువ్వుల తోటను, పర్ణశాలలో,
ఓలిదినమ్ములం గడప నువ్విళు లూరెదె? పద్యరాశి బ
స్తాలకు పట్టి సీమలకు దార్పగ వేపిళు లయ్యెనా కవీ!

వీరలు తాళపత్రముల వేదనతోడుత గట్టుకొన్న బం
గారపు మేడలందుననె కాపుర ముందురు; సర్వలోక సం
చారము సేయు శబ్దము హజారమునందు సుధారసమ్ము లా
హారముగా నొసర్చు; బళిరా! కవిపత్నికి లోటు గల్గునే?

క్ష్మాపతి సేయు మన్ననల కన్నులకుం బొరగ్రమ్మెనేమిరా!
రేపును మాపు అప్పులకు ద్రిమ్మరి యిల్లిలు దేవురింప, 'మా
కాపుర మింతపాటి,'దని కారులు ప్రేలుచు పుట్టనీని ఆ
పాపపు జీవితమ్మునకు బాల్పడి పట్టము గట్టుకొందువా?

నేటికిగూడ కట్టెదుట నిల్చును; శ్రావణ శుక్రవార మా
పూట, పయోదమాలికలు భోమ్మని శంఖము లొత్తె; చంచలల్
దాటె నభమ్ము చేటకు చెలామణి తప్పెను; కాలుపొట్టలన్
గాటపు చిచ్చులే యెగసి కాల్చెను కజ్జున ప్రేవు లార్వగన్.

అధిజ్యధన్వము

కుతకుతలాడు నాయెడద గుప్తికి వచ్చిన నాటి ఘట్టముల్;
కుతికయె ఆరకున్న పసికూన తదర్ధ నిశీథవేళ ఏ
గతి కడు పుబ్బ నేడ్చె? సొదకాకల నార్పగ వంటపాత్ర లే
గతిబడి గంటలై మొరసె? కాలము కప్పిన విస్మరించితే?

పంచి దరిద్రదేవతకు స్వాగత మిచ్చిగృహాన గజ్జె గ
ట్టించి యహర్నిశమ్ము బురిడీలకు దోయిలి యొగ్గి మోడి వే
యించి కులాసచూచుకొను; మా పసికూనకు నోట దుమ్ము కొ
ట్టించుము; దిల్ఖుషీగొనుమ యింతకు దక్క మరేమిలేదురా!

చేతులు పుండ్లుగా నలికి చేసినచేతలు వమ్ముసేయు నా
తాతలనాటి కొంపకెగదా కల సత్తువ ధారవోసితిన్;
నా తరమారె; రా నటకు; నాకిక కూడిడకున్న మానె; నా
చేతులు కాయగాచినవి; చెప్పకు దయ్యపు కొంపగోడులన్.

భూపులు ఖడ్గజీవు లని పూర్వులు చెప్పరొ? నాడు పిల్చి నీ
కీ పద మిచ్చినంతన గ్రహింపక యేల తిరస్కరింపలే?
దీపని కిప్పుడే దిగుట కేమి నిమిత్తము? నేటి ధర్మ చ
ర్చాపరమావధిం గదియజాలవొ? నాటికి చిన్నకుఱ్ఱవే?

టక్కున నొక్కసారిగ గుడారము లెత్తగ తొందరించినన్
నెక్కడ నెట్లు వీలుపడు? నిప్పటి దన్కను రాజభోగముల్
బొక్కిన నోట లేవడుల బొక్కుమటన్నను సాధ్యమే? మన
మ్మెక్కడ యే శ్మశానముల నేలుట కేగినదో వచింపరా!

నరపతి మిమ్ములన్ విడచినన్ విడచున్; మరి నేనె యైనచో,
కరకర కత్తులం దరిగి కాయము గ్రద్దలపాలు చేయనా?
పరమపథమ్ము లేవొ యెటుప్రక్కన నున్నవొ చూపకుందునా?
దొరలదు భాగ్యమా విధి విదూషకు డయ్యెను నా సభాస్థలిన్.

ఈ కొరమాలు నాకడుపు కేడునబోవ మరేమి వచ్చినన్,
ఆకట దూలి చిక్కి సగమై పడి, దేవురు గొట్టు మూకలై,
వాకిట వాకిటన్ సుతులు పట్టెడు కూటికి జోలె పట్టగా
ఈ కనులార చూడను; సహింప, నధించెద అంత వచ్చినన్.

ఏలినవారి చిత్త; మికనేమి వచింతు? కవిత్వరాజ్యమే
యేలుదురో, త్రిలింగ ధరణీశు నుదగ్ర దృగంత రోషమే
క్రోలుదు మందురో, అతని కోరిక దీరగ కావ్య మిచ్చి ని
ర్వేల సుఖాంబురాశి విహరింతురొ మీరలె తేల్చుకోవలెన్."

అనుచు తెగతెంపు చేసి యిల్లాలు పలికె;
ఎన్ని యగ్నిపర్వతములు హృదయసీమ
నొదిగి యొదిగి యెన్ని శరత్తు లున్నవేమొ
మేరుగిరియైన కవియు స్తంభించిపోయె.

అతలకుతలమైన మనమ్ము నాచిపట్టి
నిశ్చలత్వమ్ము చూపుల నెలవుకొనగ
మందమందమ్ముగా కంఠమార్దవమ్ము
తొలుక నా యువభారతి పలికె తుదకు.

"నా కవితానురక్తిని జనమ్ములు బ్రహ్మరథమ్ము పట్టి పూ
జా కుసుమమ్ము లిచ్చిరి; యశ మ్మొనగూర్చిరి; వారికంఠముల్
బాకలు పట్టె నాకు; జనవల్లభుడంతట పిల్వబంచి, ' ఓ
యీ కవిరాజ ! ఆదృతి భరింపుమ; మా సభ పేరు నిల్పుమా ! '

అని నను చేరబట్టె, సరె యంటిని; కేవల రాజ్యకాంక్షతో
జనహృదయాంబుజమ్ముల విశాంపతి యింతటి పచ్చిబూతుగా
ధనధన ఘోరవిక్రమ రథమ్మును ద్రోలునె? శాంతిదేవతా
తనువును నాల్గునిల్వులకు దాటినలోతున పాతిపెట్టునే?

పచ్చి కసాయి చేసిన కవాతును కొండలు చేసి చెప్పినన్
వ్రచ్చిన గుండెలందు రుధిరమ్ములు గ్రక్కు ప్రజావ్రణమ్ములన్
త్రచ్చి తదంతరాళముల దారుణ దావశిఖోగ్రశస్త్రికల్
గ్రుచ్చుటగాక యేమగును, కోమలకావ్యమె ఆర్తనాదముల్!

జనుల హృదయమ్ము కించిత్తు ననుప లేని
వాక్కులు ప్రబంధములో, పచ్చిబ్రద్దలో యె
వండు నిర్ణయింపగలడు? పార్థివుండు
నేడు వానికే పొంగి మన్నించు గాక!

ఏమి తలంచినాడో, సెల విచ్చెడు వేళను వీరవైష్ణవ
స్వామి, కలా గురూత్తముడు, చల్లని చేతులు నా బుజమ్ములన్
గోమున వైచి, 'నీ కవితకుం బరమార్థము వింటివే గదా!
యేమరబోకుమా తనయ! యీప్రజసేమము సంస్మరింపుమా!'

అని తిరుమంత్ర మిచ్చి మరి యంపిరి; నేడు తదాజ్ఞ దాటగా
జనునె? జనాంత్రమాలికల జాజులు కట్టిన రాజ్య తంత్రముల్
పనవి రచించి తీర్చిన ప్రబంధము నాతని కంకితమ్ముగా
పొనరుప నేర్తునా? సుకృతిపూజ్య మహాశయ మార్చ్చివైతునా?

కా దని నేడు నా కడుపు కక్కురితిం దలయొగ్గి, పార్థివా
మోదములం గడించుటకు పూనిన నా జనతా కళేబరా
లూదిన రక్తవాహినులు హోరని యేడువకుండునా? మహా
వేదన గూరి క్రుంగుచు భవిష్య యుగమ్ము శపింపకుండునా?

ప్రజ లెల్ల నీవంక, ప్రభువె యూవంక
సాహిత్య మీవంక, స్వార్థ మావంక
ధర్మమ్ము లీవంక, దర్ప మావంక
మాంగల్య మీవంక, మరణ మావంక
తొలిదాన నభివృద్ధి త్రుళ్ళింతలాడు
మలిదాన పతనమ్ము మల్లాడుచుండు.

కనలి రాజు శిరసు ఖండింప బంచునో!
'తప్పు కాచినాము తరలు' మనునొ!
తేల్చలేనుగాని తెగబడి వాదమ్ము
పెట్టునేని నాకె విజయ మగును."

పొంగి భావవీచిక పోటు పొడిచెనేమొ,
కలగి నిట్టూర్చె చంద్రరేఖావధూటి;
కోటలోని నగారాలు గొంతు లెత్తి
వరుస గోష్ఠికె పిల్చె విద్వజ్జనమ్ము.

ఆహతవ్యూహము

"మెరికలవంటి పండితులు మీ కనుసన్నల నేడు కొల్వు దీ
ర్చిరి; కవితాభిలాషమున చేరిన యీ పరిషన్ముఖమ్ములన్
పురపుర పొంగిపోయినవిపో రససింధువు లన్ని యేకమై
కరగకయుండునా కరుడుకట్టిన కావ్య సమస్య లిచ్చుటన్?

దేవరవారితో నిపుడు తెల్పెద నొక్కటి చూడు డీ తగా
దా వివరమ్ములందు వసుధాపతి భావన మూచముట్టుగా
నావల డించివై చి రసికాగ్రణులై మరి తీర్పు లిత్తురా?
కేవల భూపతిత్వమునకే ములుసూపగ నిశ్చయింతురా?"

అనుచు కవిరాజు పల్క ధరాధినేత
"కావ్యగోష్ఠిలో రాచరికాల కేటి
పేరటమ్ము? కా దని వచ్చి కూరుచున్న
అగ్రతాంబూల మెటు లిత్తు?" రనుచు బలికె.

ఆహతవ్యూహము

అంతట నా యువకవి గ
ల్లంతుగ మదిలోన లాయిలాసా పడు దు
ర్దాంతపు భావము లాచి ప్ర
శాంతుండై పలికె నిట్లు జనపతితోడన్.

“ రసికవరు లాట కావ్యమ్ము వ్రాయు మనిరి,
దానితో నెవ్వరికిని వాదమ్ము లేదు;
కాని కావ్య మెవ్వరికోస మేను వ్రాయ
వలయు సెలవిండు నాశంక తొలగిపోవు. ”

అనుచు ప్రశ్నింపగా సదస్యవరులందు
చిత్రచిత్ర సంభాషణల్ చెలగి మోము
లందు నానా వికారమ్ము లంకురించె;
ఎవ్వరికి వారుగా జవా బిత్తు మనిరి.

“ ఆంధ్రభూవిరాజాని ఆదరించె నటంట
ఈపాటిదా యేమి యితనిశక్తి
గళమెత్తి శిలలనే కరగించినాడంట
పలికిన పలుకుతో పలుచనయ్యె

చైత్రయాత్రారంభ సమయమ్ము లందుండి
స్వయముగా చూచి యీ ప్రతిభ చాల
సార్వభౌముని మహా సంస్థాన గౌరవ
మ్మారెనా పట్టి సన్యాసి దొరకె

నోరు కదపకున్న లేరుగా నావంటి
పండితవరు లీ ప్రపంచమందు
సమయ మింతవరకు సమకూరకున్నది
నేడు పట్టి యితని నిగ్గు దేల్తు."

ఇట్లు తమలోన తాముగా జట్లు తీరి
గుసగుసలు వోవు పండిత కుంజరులను
పారజూచిన ధారుణీపాలుదృష్టి
పండువంటి లాక్షణికుపై పాదుకొనియె.

పాతికయేండ్ల దనక చలపట్టున లక్షణ మెల్ల తర్కని
ష్ణాతత దున్నిదున్ని వ్యవసాయము చేసి గడించి పంటలం
బాతరవోసికొన్న కృషిమంతుడు నిస్తుల భాగ్యశాలి ఆ
భూతలనాథు చూపులకు పొంగి మరింతయి మచ్చుచూపుచున్.

"సంత సాగించి ప్రౌఢ వసంతమూర్తి
యెవరి కమ్మ నూతనశోభ లింతవరకు
చీడబట్టిన ముదితీవ చెంత జేరి
మల్లె విప్పానేమి యుబుసుపోకకైన.

ఆదికావ్యకర్త వ్యాసర్షి చంద్రుండు
భాసు డాదియైన ప్రముఖ కవులు
ఎవరి కొరకు కంఠమెత్తి పాడిరి, వారి
కొరకు మధుర కృతుల గూర్పవన్న!

విఘ్నములకునెల్ల వెలియైన ప్రతిభాన
భాసికొరకు కృతుల బాడవన్న!
బ్రహ్మానవిధమైన పరమామృతమ్మును
పంచిపెట్టుమా ప్రపంచమునకు."

అని లక్షణములు జల్లిం
చిన తేలిన రత్నములకు చిరునవ్వులు మో
మున తొలకరింపనీయక
వినయానతి నతడు విన్నవించెను సభలోన్.

"మీరు చెప్పుట లెస్స, యెవ్వారు రసిక
గణ్యులో మరి యెవ్వారు కారో చెపుడు—
బ్రాహ్మణ క్షత్రియులు మీద వైశ్యకులము
పైని విద్యాధికులు శూద్రవరులు గలరు.

గంద్రగోళమై కన్పించుగాన కావ్య
మిపుడు పేర్కొన్నవారిలో నెవరికొరకు,
ఎవరి బ్రహ్మైక్య సంధాన మెన్ను వేద
నాను భూతికొరకు వ్రాయ నగును? చెపుడు."

"ముగ్గులోన నిలిచె పూర్తిగా మొనగాడు
పట్టిచూతు నెంత పలుకు గలదో;
నిల్చి గెల్తునేని విల్చికొందును రాజు,"
ననుచు దలచి పండితాగ్రగామి—

"నవరస ఖండమండల సనాథ కవిత్వములోన నిట్టి వా
స్తవిక నికృష్టతల్ కొనలుసాచవు, పుట్టవు; ద్వంద్వభావముల్
చివురులు తాల్పబో వచట, చిన్మయరూపమె చర్వ్యమాణమై
తవులుచునుండు బుద్ధికి సదాశివమై అతివేలసత్యమై.

అచ్చట తావులేదుగ సుఖాదిక భౌతిక వేదనాప్తికిన్,
బిచ్చము తెచ్చుకొన్న నిరుపేదలు, రాజ్యము గెల్చుకొన్న వి
వ్వచ్చులు నొక్కరీతి రసపాన వశంవదులై తరింతు రా
యచ్చపుబుద్ధి నిచ్చనల నల్లిన బ్రహ్మము చేత లీనమై."

అని వాదించిన నా ప్రా
క్తన సిద్ధాంత ప్రవీణతా ధన్యుం డా
తని వాదార్థమ్ములనే
కొనసాగించుచు వివాద గోష్ఠిం దవిలెన్.

"కా దనరాదు మిమ్ము నిటుగా వచియింపడె భట్టనాయకుం
డాదినె? యీ రసస్థితికి నాద్యనిదానము లేకదా విభా
వాదికముల్ నిసర్గ హృదయాంతర దేహవికారజన్యముల్;
వాదములేదుగా భరతువాక్యము లిచ్చట మా ప్రమాణముల్.

జీవనమందు భావములచే జనియించు వికారవీచు లె
ట్లే విధి వచ్చుచుండు నటులే కృతివాహిని నుద్భవించు ఈ
జీవన మెట్లు మారుపులు చెందునో కావ్యము నట్లె మార్పులన్
బోవును కాని రెంటికి నపూర్వ విశేషము కానుపించెడిన్.

కావ్య మన్న నిత్యానంద భావ్య మగును
జీవనమ్ము నిత్యానంద భావమగునె?
ఈ విభేదమ్ము జీవన వృత్తి నెరిగి
గారడీ చేయుచున్నాడు కవివరుండు.

అతడు నిర్లిప్తతా వర్ణమందు, కుంచె
ముంచి కావ్యరచనమందు ఎంచి కుంచి
పాఠకహృదయమ్ము కొరకు వ్రాయుచుండు
వ్రాతలోనె నిత్యానంద పదవి గలదు.

ఆ విచిత్ర వర్ణమ్ములో నద్భుతమ్ము
కేవల మ్మొక ద్రవ్య, మిం కేవి యేవి
కలవో మీవంటి ప్రాజ్ఞులు కాంచవలయు;
ఇంతవర కొప్పుకొనబోవ రేని వినుడు.

నచ్చదు జీవితమ్ము పరిణామము చెందు నటన్న; మీకు ఇం
దచ్చెరు వేమిలేదుగ; దృగంతము లొత్తి చరిత్రగర్భముల్
విచ్చితిరేని మీకు గనుపింపకయున్నె పరశ్శతమ్ములై
మచ్చులు, పూర్వకావ్యములుమాన్పనుపో తమసంశయమ్ములన్”

అనిన లాక్షిణుకుడు మందహాస మొలుక
"మీరు చెప్పినట్లుగ జూడ భారతమ్ము
నాది కావ్యమ్ము నేడు కావ్యమ్ము లగునె
దీని కెవ్వ రొప్పుదు రన్న?" దీక్షితుండు—

"సంప్రదాయమ్ము మనకు ఆచార్యకమ్ము
దాననే పూర్వకృతులు స్వాద్యములు నేడు
సంప్రదాయమ్ము విడనాడి చదువుకొన్న
వానిచేత గలుగునా రసానుభూతి?"

అని సమాధాన మిచ్చిన యంత లాక్ష
ణికుడు తలవ్రాల్చె; అచటి పండితులు నా క
వీశ్వరుని భావమిసుమంత యెరుగలేక
విసిగి నిట్టూర్పు గాడ్పులు విడిచినారు.

"ఏమయ్యా యువభారతి!
ఏమని సారాంశ మింత కేనియు రాదే,
యీమాపున తెమలింపగ
లేమా?" యని పార్థివుండు లీలగ నవ్వెఁ.

యుగసంధ్య

తలపు తననోట బలికింప దలచు రాజు
భావమెఱిగి కవీంద్రుండు ప్రజ్వలించి
కొలువునంతయు నొకసారి కలయజూచి
కక్కస మ్మెల్ల నట వెళ్ళగ్రక్క దొడగె.

శారదవేళ నీ బురుజుచంకల నున్న ఫిరంగిబారులే
మోరలు మీఁది కెత్తుకొని పో రని హోరున పోరువెట్టినన్
గ్రూరతరమ్ముగా భటులు గుండెలు గ్రుమ్మిరి దాన ప్రాతపం
చారపుభేరి గుండె దిగజారి రణమ్ము రణమ్ము రం డనన్.

అత్తరి నీ యనుజ్ఞలు లతాంగులపావడ లొల్చి బావుటా
లెత్తిన మానభంగముల కేడ్చుచు క్రుంగుచు వాయువీచికల్
నెత్తురులై మోదుకొన్న, వవినీతికి భానుడు జంకి మేఘపుం
బొత్తులలో నడంగె, వలపోసెను దిక్కులు గోడుగోడునన్.

పుటపుట నెమ్ములన్ విరిచి పోసి గడించిన రోజుబత్తెముల్
గుటగుట త్రావి, నీ విపులకోశము మోసల కెక్కె గర్భముల్
పుటుకున ప్రీల్చుచున్ కరగబోసె ఫిరంగులు వేనవేలుగా,
కటకము నిండి మా కడుపు కాలి సహస్రపుటమ్ము లెత్తెగా.

ఆహతవ్యూహము

ఓడక జైత్రయాత్ర మన సువ్విళ్ళు లూరిన ఊర నాట బో
డ్డూడని పిల్లసింగముల కుచ్చులు వోసి తరల్చి రక్తపుం
బాడవలందునన్ వదలి బారులు బారులు తీరిపించి మీ
మాడు వగుల్చుకొం డని యమాంతముగా ఉసికొల్పి చూడవా?

గెలుపున కాస జేసి వెలిగించిన నీ భుజశౌర్యదీప్తిలో
గలగల కోడిపోసిన దకాలపు మృత్యువు లేతపుచ్చెలన్ ;
కిలకిల నవ్వి ప్రేతములు నృత్యమదేపని నొల్కబోసె, ప
ల్లల ననివార్య వైఖరుల లేవడి తీర్చిన నిండుకొల్వునన్.

ఎందరి మాతృగర్భముల నెర్రని నిప్పులు వోసి కాల్చెనో
ఎందరి గుండెలన్ వగపు లెప్పటికప్పుడు దంచిపోసెనో
బందుగు లాప్తులన్ గురుల బాపుచు తావక వాహినీబల
మ్మెందరి డెందముల్ గలచి యీసున నాయువు క్రుంగదీసెనో !

మూపుల నూది హుమ్మనుచు మూరెడు మీదికి లేవనెత్తినన్
బాపురె! ఒక్కబార దిగబారును కర్ణుని తేరుపోలికన్
కాపుర, మిట్లు దిక్కు దెస గానని బీదలమీది కేగదా
గూపులు వేసి త్రోలితివి, క్రూరతరమ్ములు బాహుశౌర్యముల్.

యుగసంధ్య

కొల్లలు పండు చేల నలుగొంగుల పల్లెరు లల్లిబిల్లిగా
పల్లిక లల్లుకొన్నవి, సిపాయిలరీతిగ తుంగగడ్డలున్
పిల్లలు పెట్టి కాపురము పెళ్ళున దీర్చెను, రెల్లుదుబ్బు లం
దుల్లస మాడు మందపవనోర్మ్మిల రైతుల వేడియూర్పులన్

పొంగి స్రవంతులై రుధిరపూరము గ్రమ్మిన రొంపి యయ్యె, ఆ
ప్రాంగణ మందు జీవితశతాంగము జందెపుగాళ్ళు వై చినన్
టంగున టంగువాళ్ళు తెగటాకుటె గాని కదల్పరాక రై
తాంగము ఘోషపెట్టునుగదా జనవల్లభ! ఆలకింపవా?

ఇంతలు చేసినావు సరె, ప్రజ కేమి లభించె నయ్యా? దు
ర్దాంత తనూజ శోకములు తల్లులగర్భములందు రేగి పొ
ర్లింతలు పెట్టి యేడ్పును పొరింబొరి ఊరక కల్వరించు ప
శాంతియు లేక మూల్గు తమ చల్వలు నిచ్చలు నెత్తిపోయుచున్.

ఎండి ఇల కరుచుకొని పోయిన బికారి
పొట్టలందు నీ శౌర్య సంపూర్ణగరిమ
త్రాగి తందనా లాడు కిరాతకన్య
వోలె దయకు గుండె గరగి జాలువార.

ఆహతవ్యూహము

స్వాములచిత్త మింతటి విషాదకథాకథనమ్ములో కవి
త్వామృత మానునా? జనహృదంతరరక్తము పుక్కిలించునా?
ఏ మని వ్రాయగావలయు? ఎట్టులు చేతులు వచ్చు? ఇందులో
పాముకు తింద మన్న వస వల్చెడు నెత్తురు ముద్దయేగదా.

నములుదునా మ్రింగుదునా
ఎముకలతో నన్నయట్లు లీ నిరుపేదన్
ధుమధుమ చూచెద రేటికి ?
తమకుం గనుపింపబోవె దారుణభంగుల్ ?

తీర మీ పేరు నోటను జారెనేని
కబురులను చెప్పుకొనువారు కలగుచుంద్రు;
పెటుకు పెటుకున నిల్లాలు మెటికె విరుచు;
నవ్వుచుండెడి పసికందు కెవ్వ మనును.

ప్రాయపు వేడినెత్తురులు వాకలు గట్టిన వీరభూసతీ
స్నాయువులందు బత్తెములు చాలని శూరుల ప్రాణఘోషముల్
పాయక తీవరించి పరిపంథుల నెత్తుటితర్పణమ్ముకై
హా యని యార్చుచున్నది మహోచ్చలి తానిల రోదనమ్ములన్.

కాదనియన్నచో నుడువ గల్గుదుమా నృప! కాండ్రుకాండ్రునన్
మీదికి దూకనున్న మిడిమేలపు బెబ్బులి విక్రమమ్ము లు
న్మాదకరమ్ములో? మధుర నవ్య సుధారస కారకమ్ములో?
వాదము చేయగా వలెనె పండితు లిందరు తేల్చి చెప్పగన్?

క్రిందును మీ దెరుంగక చరించిన మీకు భవత్ప్రతాప మా
నందము గూర్పవచ్చును, ధనమ్మును మీకడ పుష్కలమ్ముగా
పొంది కుదింపరాని పెనుబొజ్జలు పెట్టిన యయ్య లెల్ల రా
నందము పొందవచ్చును, జనమ్ముల కియ్యది నచ్చివచ్చునే?

తెగబడి మీ ప్రతాపము నుతించిన నేర్పున కావ్య మల్లినన్
భుగభుగ మండిపోయెడిని పో జనతాహృదయాంతరాళముల్,
సెగపొగ లొక్కసారి జనసీమలు గ్రక్కును నాల్గుప్రక్కలన్,
పగ లెగద్రోయు భావనము మాన్యతమమ్మగు కావ్యవస్తువా?

వేదన లార్చి పేర్చి నడివీపున గ్రుద్దుచు నున్న త్రోచి ఆ
స్వాదన ధర్మముల్ దుడిచివైచి సమాజ శుభక్రమాభి సం
పాదన విస్మరించి మహివల్లభు డిచ్చు పసిండికోసమై
మై దొనరింతురా కవు? లమానుషముల్ గద యీప్రవర్తనల్!

ఆహతవ్యూహము

స్వార్థపరాయణత్వ మెటు లాడిన నట్టులె యాడి యీ సమా
జార్థము పొంగి వచ్చు కవితామృతవాహిని కట్టివైచి నీ
మూర్ధమునందు నిల్పుకొన బోలునె? పూర్వయుగమ్ములందు ఏ
పార్థివుడైనగాని యిటువంటి దురంతము లాచరించెనే?

కలిగిన నింత పూయుమురు, కట్టుడు; రంతియెకాని, యీ ప్రజా
వలి జపియించి పొందిన తపఃఫలసాహితి మ్రింగవచ్చునే?
వలదు, మహాపరాధ మొకపట్టున బోవదు, నీచరిత్రకున్
పెళపెళ దిట్టిపోయును భవిష్యయుగమ్ములు క్రోధవిద్ధముల్.

ఓ రాజ! ఓ రాజ! హుంకరింపకుము,
ప్రజపట్ల ద్రోహమ్ము పాడియే కాదు,
సంఘమ్ముతోడిదే సాహిత్యలక్ష్మి,
దీనిపై నేహక్కు దీపింప బోదు,
కడగి కోపమ్ముతో గారించినైన
పడయంగ రా దయ్య ప్రభువుల కెట్లు,
జనుల జీవితములే సామగ్రి కవికి,
ప్రజ లాదరింపగా బరగు కావ్యమ్ము,
ఇట్లున్న ధర్మమ్ము నీసడింపకుము."

ఉరుమని పిడుగుల నీ గతి
గురియించిన నా కవీంద్రు కోపమునకు ది
మ్మరపడి వెడచూపులు చూ
చిరి తద్గోష్ఠి గల సూరి శేఖరు లెల్లన్.

ఆ కల్లాడదు తత్సభా సముపకంఠారామ వృక్షమ్ములన్;
మూకీభావము నొందె విహ్వలములై పుంస్కోకిలవ్రాతముల్;
చీకాకై వెడలింప జంకె లతికల్ నిశ్వాససౌగంధ్యముల్;
ప్రాకెన్ వీచులు వీచులై యట భయభ్రాంతుల్ వికీర్ణమ్ములై.

నమల లేక, మ్రింగను లేక, నరవరుండు
గోష్ఠియందు నీవా, నీవ, కొమ్ము లొడ్డి
గెలుతు వన్నట్లు వీక్షించె; కిక్కురు మన
రైరి పండితులం దొక్కరైనగాని.

అంత పారిషదులు లోన వ్యాకులపడ
ఆంధ్రధారుణీజాని నేత్రాంబుజాల
గౌరవ మరందములు జాలువార జూచి
ఘంటాలు గుదించి తీర్పు వాక్రుచ్చె నిట్లు.

ఆహతవ్యూహము

“ఓ కవిరాజ! పూర్వ మెను రొడ్డి ధరాభృదుదగ్రు నీవలెన్
డీకొని యేకవీంద్రుడు పెటిల్లున వ్రక్కలు సేయనేర్చెనా?
ఈకరణిన్ కృతీశు లడ లెత్తిన కాడిని పారవైచిరా?
కైకొన వన్న! నిన్నె జయకాంత వరించెను కావ్యగోష్ఠిలోన్.

వాదమునందు నోడితిరి పండితమండనులార! వీరి శ్రీ
పాదవిభూతి గోరి అభివాదము సేయు డనుగ్రహ మ్మపా
సాదిత మైన మీకృతులు శాస్త్రహితమ్ములు మంజులమ్ములై
చాదు సుధారస మ్మొదల సానల; సందియ మంద నేటికిన్?

చి త్తయినారు వాదమున శీర్షము వంపగ చిన్నవోదురే?
మెత్తురె యీప్రవ ర్తనము? మేలగునే? యిక, కాదు మ్రొక్కుడీ,
బొత్తుగ పిన్నపెద్ద లను పూజనభావము వీటబుత్తురే?
గ త్తరపాటు లేమిటికి? కాల్గదలింతురె మ్రొక్కకుండినన్? ”

అని శాసించిన నృపు గా
దన జాలక కవులు పండితాగ్రేసరు లా
తనిపాదమ్ములకున్ వం
దన మొనరించుచు నిలిచిరి. ధాత్రీవరుడున్ –

పోం డని వారలం బనిచి, పూర్వమహీంధరమందు బొల్చు మా
ర్తాండుడువోలె నున్న కవిరాట్టును కన్నుల గప్పుకొంచు "బ్ర
హ్మాండము బ్రద్దలై నదిసుమా తమశాస్త్రవివాదఘోషతో,
పండెను పొమ్ము మేము తొలిబామున జేసిన నిండుపున్నెముల్.

ఇంతటి సాహసిక్యముల నెందును గంటిమ వింటిమా? మహో
దంతముముందుముందుజనత హృదయాంబురుహంబులందునన్
గంతులు వెట్టు, కావ్య మయి గానము సించు దిశాసతీసభా
భ్యంతరమందు, జన్మము కృతార్థము పొమ్ము, జగత్ప్రియంకరా!

దుస్సహముల్ వివాదములతో కుపితమ్ములు రాజ్యతంత్రముల్
బుస్సన తోకపై నిలిచి ఘూత్కృతి సేయుచునున్న, వింక, నా
యుస్సును బట్టి పీలువక యుండునె? పొం డని సాగనంపునే?
కస్సున కాటు వేయు; నటు గావున నూపిరిదారి చూడుమా.

కా దన కున్న నొక్క యుపకారము సేయగ సాహసింతు, సూ
ర్యోదయరాగముల్ దెసల నోడిక గట్టకము స్ఫురమ్మనం
దేదరిదాపునన్ నిలువ కేగిన ప్రాణము దక్కు; లేనిచో,
నాదట వచ్చు మృత్యువున కాదుకొనం దరమానె బ్రహ్మకున్ ?

ఆహాతవ్యూహాము

ఇట్లు కరుణారసమ్ము చిందించు నృపుని
చిత్తపరిణతి మెచ్చి యాశీర్వదించి,
కావ్యధర్మ రక్షార్థియై కంఠ మొడ్డి
న యువభారతి సెల వొంది నడువ సాగె.

విలక్షశిలీముఖము

"ఆద్యుతి కాలకూట విషమై తల కెక్కిన నోలగమ్ములో
నేదియొ కూసెనంట కవి; యెట్టులు వింటివి, సైచి తయ్యా? ఆ
చీదర నాల్క నేమిటికి చీల్పవు నీ కరవాలధార? ఆ
మోదము చూపితే? విసము పోసిన మ్రింగుట కామతించితే?

పూటకు దారి లేక వలపోయు నొకానొక ముష్టివాడె ఈ
నాటికి రాజ్యభోగుల ఫణాఫలకమ్ముల దన్ని మేనితో
బైటికి బోవ జాలునట, ప్రాణము లుండవ రాచబొందిలో?
గోటను గిల్లివైతు మిదిగో, కవిమస్తక; మూరకుందుమా?

తూరుపుకోటపై విజయ దుందుభి మేల్కని మా నృపాలకా
గారములో ప్రభాత రవికాంతుల బొంగుచు మంద్రనాదమై
సారపుబల్కులం బలుక సాగక మున్నె పురాగ్రగోపుర
ద్వారమునందె ఆ కవికపాలము గట్టెద దోరణమ్ముగాఁ.

ఆ రాజద్రోహాత్ముని
ఈ రాజ్యము దాటి వెడల నిచ్చినచో నీ
గౌరవము ప్రజాశాంతియు
సారెకు నశ్రువులు నించ సాగక యున్నే?

అతడు కేవల మల్పుడే యగునుగాక,
తంత్రగమనమ్ముల దయకు దావు లేదు;
రాచసింగపు గొదమపై రాలు రువ్వి
ప్రాణములతోడ కవిగాడు బయట పడునె?"

అనుచు కత్తి నూరెడి యమాత్యవరు జూచి
నృపుడు నిముసమ్ము యోచించి విశ్వసించి,
"చెప్పకుందురా మీకు విశేష మెల్ల
ధర్మ మేరీతి దిగ్రావ దగును? చెప్పుడు.

ఆ వివాదమ్ములో నేను కేవల ప్ర
మాత నై తీర్పు చెప్ప ప్రమాణ మూని
పిదప రాజునై యెట్లు జృంభింప నగును?
ధరణిధవుడె వాగ్దానమ్ము తప్పునేమి?

ఒలిబలిగ పండితుల నెల్ల నోడ్చె నతడు
దానికి దల గొట్టింప సత్కార మగునె?
ఇంత నిష్ఠురమ్ములె రాజ్య తంత్రవిధులు?
చాలు జాలు నెత్తకు డా ప్రసంగ మిచట.

విభుడె తానుగా వాదమ్ము వేడెనంట,
కాదనగ లేక కవిరాజు కడగెనంట,
ప్రాణములు దానికై తీయ వలయునంట,
కటకటా యిట్టి ఘోరమ్ము కలదటయ్య!"

అనిన భూపాలు గని మంత్రి హాసరేఖ
తెల్లమీసాలలో న త్తమిల్ల బలికె—
"రసికు లెవరయ్య? ఆంధ్రసామ్రాట్టు లెవరు?
ఇరువు రున్నారు గాబోలు హృదయసీమ.

కుడిప్రక్క హృదయమ్ము కువలయేశుండు,
బడిప్రక్క హృదయమ్ము ప్రతిభానశాలి,
ఓహో! విశేషమ్ము లూకొన నమ్యో,
ఈమాత్ర మెరుగవే ఈనీతి నీవు?

రాజ్యచక్రము నింక రక్షింతు వేని,
కవిని పోనిచ్చుట కర్జమ్ము కాదు,
ఈపైని రాగల వెద్దడుల్ వినుము;
రక్తపాతము నిన్ను రంజింప దేని,
కవికంఠ లుంఠన కావింప నాకు
వేవేగ ముద లిమ్ము, వెడలి తేల్చెదను.

కపి యని సంకోచమ? మా
నవుడే కాడా? అతండు నరికిన తెగడా?
మివులునె కొమ్ములతో? కా
లవిలంబన మేమిటికి తలం దెగజూతున్."

అనిన వారించి సర్వంసహాధినేత
"ధారుణీపతి వాక్యమ్ము తప్పి చనదు,
రేపు పురి నున్నచో పెడరెక్క గట్టి
అతని గొని ర,"మ్మనుచు మంత్రి నంపివైచె.

ప్రసక్తప్రస్థానము

“గాలమువైచి నాకొఱకు కాలము కన్నుల నార్పకుండ ఆ
జీలుగ కాచుకొన్నది; నసీబున గీసిన కుంటి గీతలో
కాలము మూడునో, పురుషకారములే విజయమ్ము లందునో!
జాలము సేయరాదు నిముసమ్మయినన్, పయనమ్ము గట్టుమా!

భానుడు ప్రాగ్గిరీశాచలముపై కెగబ్రాకుచు జాగు, కాశ్యపీ
జాని మహోగ్రశాసనపు జాగిలముల్ గొని నాలిలేని నా
ప్రాణము వేటలాడుటకు పంతము పట్టినవాడు; తెల్లమై
దానము లల్గి నా రుధిరధారలు గ్రోలి సమాధికట్టునో!

అన్నము పున్నెముం దెలియనట్టికుమారులు నింకుకుండలై
కన్నులుమూసి, కోరికలు కట్టిన దివ్యజగమ్ములందు, ఏ
పొన్నల నీడలం దిరుగబోయిరో! మృత్యువు, కన్నుగట్టి, ఆ
ప్రన్నని పిల్లవాండ్ర కెగబడ్డది, లేపుము, లేపుమా చెలీ!

ప్రసక్త ప్రస్థానము

భూపతి శాసనమ్మునకు బోసిన యుచ్చుల నొక్కటొక్కటే
తేపకు తేప కాల్చి తెగద్రెంపుచునున్నవి యీ నిమేషముల్;
తాపములేదు నీ హృదయతామరసంబున బ్రహ్మగంటివా,
కోపము కొల్మి నై కొనిన గుండెల కత్తులు నూరుచుంటివా?

తాకిన తాకుతో తల బదాబద లైనది, నెత్తు రోడె; పెం
జీకటు లేలుచున్న గృహసీమల దీపము పెట్టుకోరె? నీ
వేకడ నుంటివే, పలుక వేమె, పరాకులు పాడుగాను! నా
వ్యాకులజీవితమ్మున దివాంధము కూత కుపక్రమించెనే!

సైఁ యని యొంటికాలున, విషాదపదాహతి గుందు నాపయిన్
దాయముగట్టి మృత్యువు క్షుధావివశమ్మయి దూకుచున్న, నీ
కాయముపచ్చునా, పగలు నాదృతి దర్పము లారితీరునా,
ఛీ యనకుందురా ప్రజలు, చేష్టలు చేదయి తిట్టకుందురా?

పరపర మిత్తి దేహ మొకప్రక్కను గోయుచునున్న గాని నా
మొర చెవి దూరబోదు; ముసి ముట్టదు; చేసినపాపమిట్లు మో
చరచుచునున్నదా? యకట! జాముల నీపురుషాయుషమ్ము క
త్తెర బడి పోవసాగినది; తిట్టిన తిమ్మిన లాభమేమిటే!

ఎంగిలి మంగలమ్మయిన యీతని దుర్భరజీవితమ్మునన్
క్రుంగుచునున్న జీవములకోసము గోట్రిలుచుండలేదు; పొ
న్నంగుల జంటవోలె శయనమ్మున కన్నులు మూసి, నిద్రలో
బంగరులోకమేలు పసిబాలుల ప్రాణము సంస్మరింపవే!

మదవతి, ఒక్కమాట! అభిమానము లిప్పుడు దోయిలించి, నీ
పదముల నంటి మ్రొక్కుచు, "కృపాపరిపాకము భిక్షపెట్టుమా!
బదవలుపడ్డగాని పసిపాపల సాకు తెరంగులే" దనన్
పెదవులు విచ్చి; మాతృపదవీన దవీయసి, ఆలకింపవే!

ఇంతకు, చిత్రగుప్తుడు లిఖించిన జీవుల జాబితాల నా
వంతున కాయు వంతమని బఱ్ఱున గీటున బుచ్చినాడో! ర
వ్వంత విచారమేని హృదయమ్మును సోకక గండరించితే!
ఇంతులగుండెలా, అకట, యినుమువి దాచిన చట్టుబండలా!

పోరొనరించుచుండి రణభూమిని గూలిన చింత గల్గ; దా
భూరిగుణుండు నన్విడిచి పొమ్మని చెప్పిన రాజధానికిన్
దూరము వోవలేక నృపదూతల చండకృపాణధార కా
హారముగా శరీరము సమర్పణముం బొనరింపవచ్చునే?

ప్రసక్త ప్రస్థానము

పనివడి దేశరక్షణమొ, పాడియొ కోరిన ఆదధీచివై
తనువును గోసి యిచ్చెదగదా; యిటు లూరక పచ్చినెత్తురుల్
దోనదోన కార్పగా దగునె? దోషము, శాస్త్రవిధీయమానము
హ్వాన గతియించునొకో? గమనోన్ముఖివై పయనమ్ముగట్టవే!

ఇంతగ కాళ్ళ వ్రేళ్ళబడి యేడ్చిన, కాదని మొత్తుకొన్న, నీ
స్వాంతము చయ్యిచయ్యనదు, జాములగోడిగ లెక్క, రివ్వనన్
కుంతము లార్చుకొంచు, మెరుగల్ వలెదూకుచునున్న ఘోరకా
లాంతకకోపరేఖలకు నాగుదొ, జంకక నిల్చి క్రాగుదో!

ఓ మొగలాయిరాణి! కరుణోదయకారణవర్తనమ్ము లే
మేమియొ విన్నవించుకొన నెంచుచు ముంగిట మోకరించె; ఈ
మోమయి చూడరాదొ? వినబోలదొ? మేలిముసుంగుటుంగునన్
ప్రామితి, వింతలో గడసబారితివేమొ, మరాళిగుబ్బమా!"

"ఎవ రయ్యా లోపల? మా
యువభారతి కవివరేణ్యు లున్నారా? ఓ
యువభారతి! యువభారతి!
వివరము రా దేమి యెంత పిలిచిన నిచటన్?"

యుగసంధ్య

" అమ్మా, అమ్మా, యిక లే
వమ్మా! మన యూరు పోద మంటివిగాదా,
తమ్ముని గొనిపోదము, కను
దమ్ములు విప్పగదె చిట్టితల్లీ; యింకన్.

గిలిగిలి చక్కిలిగిలిగిలి
తొలగెను మాతల్లినిదురదొంతర లెల్లన్;
కిలకిల మా బంగారపు
చిలుకే నవ్విన దిగంత సీమలు గులుకున్.

కన్నులు నులుముటలోనే
యున్నది వ్యాపార మింక, ఉత్సాహ బలె బలే,
తన్నున బోయెను మత్తులు,
వెన్నుడు మాయమ్మ యగుచు వెలసెను, లెమ్మా!"

" ఎవ రయ్యా లోపల? మా
యువభారతి కవివరేణ్యు లున్నారా? ఓ
యువభారతి! యువభారతి!
వివరము రా దేమి యెంత పిలిచిన నిచటన్?

ప్రసక్త ప్రస్థానము

“ నాన్నా ! నాన్నా ! నీవా?
కన్నులు కనరాని యంధకారము గ్రమ్మెఁ;
పన్నుండి కలలు కంటిన?
ఎన్నో కనుపించె బూచు లింతకు మున్నే.”

“ ఎవ రయ్యా లోపల? మా
యువభారతి కవివరేణ్యు లున్నారా? ఓ
యువభారతి! యువభారతి !
వివరము రా దేమి యెంత పిలిచిన నిచటన్?”

“ తలుపు తట్టి యెవ్వారె నిన్ను బిలుచువారు?
దద్దరిలి పోవుచున్నది ద్వార మెల్ల;
వారు సాయమ్ము వత్తురా యూరిదనుక?
నాన్న ! పోబోకు వచ్చుచున్నాను నేను.”

అనుచు ముద్దుకూతురు పల్కినయంత జంద్ర
రేఖ మంచమ్మునందుండి రిక్కవోలె
దుమికి జీవితేశ్వరుని పాదములపైని
వ్రాలి చుట్టుకొనియెను బాష్పమ్ము లురల.

యుగ సంధ్య

“ వలదు కదల వలదు వాకిట నిలబడి
పిలుచుచుండె మిత్రి తలుపు తట్టి,
బాస యిచ్చి యిటుల భటుల బంపించునా?
రాజుగుండె వట్టి రాతిబండ.

నిజము తెలియ లేక నీళ్లు వోయితి గాని,
ప్రాణ మారగింప పాలుపడియె
ధారుణీశు డంచు తలపగా లేనైతి,
గేలిమాట లంచు బేలుపోతి.

నేటితోన నీకు నిండెనా నూరేండ్లు?
బ్రహ్మవ్రాత యిట్లు పండెనేమి?
ఇంత నిష్ఠురంబె? యీయయ్యహృదయమ్ము?
జాలి నమ్ముకొన్న చంపునేమి?

కునుకు పులుగుజంట గుండేలుబ్రద్దతో
కొట్టి కూల్చునొక్క క్రూర మనక !
ఓయి కాలపురుష ! న్యాయమా యీయది?
కంట నిప్పు బోసికొంట కాదె?

ప్రసక్త ప్రస్థానము

రాచపగలు కోడెత్రాచులై కావలా
కాయుచున్నవి తలకాయ లొగ్గి;
కదలితేని నిన్ను కా టంది తీరురా,
గడప దాటి యిపుడు కదల వలదు."

అనుచు దీనయై పలుకు నిల్లాలి జూచి
పలికె కవిరాజు గుండెనిబ్బరము మెఱయ;
"చంప దలచిన రాజు న న్నంప నేల?
వెనుక భటులచే నిట్లు కవ్వింప నేల?

పిచ్చిదాన ! కేవలము నీ వెఱ్ఱి గాని,
అతడు చంపింప దలచిన స్త్రైన నీకు
నాకు నీ రాజ్యమున శరణ్యమ్ము గలదె?
దిగులు సొచ్చినంతగ కడతేర లేము.

ఇంక దీపమ్ము వెలిగింపు మిపుడె పోయి;
దేనికై పిల్చుచున్నారొ తెలిసి వత్తు;
గడచి పోవుచున్నది పుణ్యకాల మెల్ల;
నిలువ రా దిట మన కొక నిముస మైన."

ఇట్లు భార్య నోదార్చి కవీశ్వరుండు
చేయ వలసిన కార్యమ్ము చెప్పి కదలి,
ద్వారభూమికి నేతెంచి తలుపు తెరచి
ఏమి వీక్షించినాడో స్తంభించిపోయె.

బందము త్రెంచుకొన్న నరపాలుని శాసన మప్పుడే జమా
బందికి వచ్చెనేమొ, కృకవాకుముఖమ్ముల కాలధూర్తుడే
చిందము నొత్తగా పెదవి జేర్చెనొ, తూరుపుకాంత అయ్యుష
స్సుందరికోసరమ్ము తిరుచూర్ణపు లత్తుక రంగరించెనో.

"భిక్షాం దేహి జనావన
దీక్షామహితాంతరంగ దీవ్యత్కవితా
నిక్షేపా!" యను తీవ్రబు
భుక్షాకృత యాచనమ్ము మ్రోసెం జెవులన్.

వెడలి వచ్చిన ఆ శబ్దవీచితోన
కమ్ర కర్పూర వీటికా గంధ మపుడు
బుగులు గొన్నంత కవిరాజు పోల్చుకొనుచు
"ఆంధ్రధారుణీవల్లభా! స్వాగతమ్ము.

ప్రసక్త ప్రస్థానము

నిలువ నేల యిచ్చోటఁ? లోపలికి రండు,
పావనం బయ్యె నేడు నా జీవనంబు,
కల్పశాఖికి దప్పి పోకార్ప జాలు
నంట, కంటిమే యిట్టి మర్యాద లెందు!"

అనుచు నా రాజుతో గృహాభ్యంతరమున
కేగి యుచిత సత్కృతుల గావించి ఉన్న
తాసనాసీను జేసి చూ పంత యతని
యాస్యమున నిల్పె; నయ్యుదారాశయుండు—

"ఈ తరుణేందుదీప్తి నిదురింపగ నీయక నామనమ్ము ను
ర్రూతల నూచి తెచ్చె రస ముగ్గుగ ద్రావిన నీ మనోజ్ఞ వా
ణీతరలార్ద్రగీతిక, పునీత పురాతన గాథ సౌహృదం
బీతరి సంస్మరింపుమ కవీశ్వర! కావ్య మనుగ్రహింపుమా!

రత్నగర్భాధిపత్యమ్ము రాపు సేయ
నిటకు వేంచేయ లేదు, వీక్షింపవన్న!
పూర్వ సుస్నేహము లిపుడు మోకరించి
వేడుచున్నవి మీ కావ్యభిక్ష కోరి."

అని రసతృష్ణామతి బ
ల్కిన విని అయ్యాంధ్ర రాజ కేసరి కాతం
డనియెన్ "సాహిత్యారా
ధన మిప్పుడు పండి వచ్చె, ధన్యుడ నైతిన్.

కావలె మీ కావ్యము, మా
కీవలె నని రసికవర్యు లీగతి వేడం
గా వచ్చె నింక కవితా
జీవులమది యేమి కాంక్ష సేయును జెపుమా.

హృదయ కేదార ఖండమ్ము నెల్ల ఆత్మ
వాక్య నిర్గళిత సుధాప్రవాహమందు
ముంచి యెత్తెడు కాంక్ష లుప్పొంగి కాదె
చేయుచున్నారు సుకవు లమేయతపము.

వెదుక బోకుండ నతియోగ్యు డెదురుపడియె,
కూతు లున్న తండ్రుల కేమి కోర్కె లుండు?
ఐన నోచుకోలేదు కన్యాప్రదాన
మున కొకతె కల దర్పించు టనుచితమ్ము."